సాక్షి కామారెడ్డి

బుధవారం : 22 : ఫిబ్రవరి : 2023



త్వరలో పోడు పట్టాలు

పోడు భూములకు సంబంధించిన సర్వే పూర్తయ్యిందని, త్వరలోనే అర్హులకు పట్టాలు ఇస్తామని స్పీకర్ పోచారం తెలిపారు.

- 8లో ▸



అర్హులందరికీ ఇళ్లు

మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.9 /13.3

ఉదయం చలిగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అన్ని వార్డులలో పశువులకు బుధవారం లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి భరత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లంపి స్కిన్‌తో ఆవులు మృత్యువాత పడుతున్న విషయమై 'సాక్షి' వరుసగా కథనాలు ప్రచురిస్తోంది. దీనిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు టీకాలు వేస్తామని పేర్కొన్నారు. పశువుల యజమానులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి యూత్, 400 మీటర్ల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 260 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపికైనవారు ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.వెంకటి, మధుసూదన్‌రెడ్డి, ఆర్.శ్రీనివాస్, ఎం.నరేష్‌రెడ్డి, శ్రీధర్, అతీకుల్లా, అనిల్, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, నవీన్, స్వప్న, లక్ష్మణ్ రాథోడ్, సంజీవ్, నరేష్, ఇమ్రాన్, శ్రీరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైంది వీరే: ఈశ్వర్, శ్రీను, సునీల్, సచిన్, అనిల్, నందిని, అఖిల, సాయిభవ్య, లక్ష్మి, హరిత, భరత్, అఖిల్, అర్జున్, ఆకాష్, సురేష్, నానక్‌సింగ్, నవీన్, రవీందర్, ఎల్.అఖిల, మల్లిక.

22 నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ

కామారెడ్డి క్రైం: గొర్రెలు, మేకల ఆరోగ్య పరిరక్షణ కోసం 22 నుంచి 28 వ తేదీ వరకు నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నారు. ఈ విషయాన్ని జిల్లా పశువైద్యాధికారి భరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 50 పశు వైద్య బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 5,73,769 గొర్రెలు, 1,69,831 మేకలు ఉన్నాయని, అన్నింటికీ మందు పంపిణీ చేస్తామని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తమ జీవాలకు మందు వేయించాలని సూచించారు.

24న జాబ్‌మేళా

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్బీఐ కార్డ్స్ కంపెనీలో 200 ఎగ్జిక్యూటివ్ మేనేజర్ పోస్టులు, 50 బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులు, 20 యూనిట్ మేనేజర్ పోస్టులు, 50 టెలీకాలర్ పోస్టులు భర్తీ చేయడం కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు బయోడేటా, సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని తమ కార్యాల యంలో సంప్రదించాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 90009 37805, 98482 37987, 76719 74009 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నోటీసులు ఇవ్వకుండా కూల్చొద్దు

భిక్కనూరు: మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారి వెడల్పు పనుల పంచాయితీ హైకోర్టుకు చేరింది. సింగిల్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య తన ఇంటిని కూల్చొద్దని కోరుతూ మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. గ్రామ పంచాయతీ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చవద్దని, నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించింది.

8 మందికి ఉద్యోగాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం జంగంపల్లి రాఘవ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 8 మంది ఉద్యోగాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ, ప్లేస్‌మెంట్ సమన్వయకర్త పర్వీన్ ఫాతిమ, మెంటార్ అజారొద్దీన్, సత్యనారాయణ, అఫ్రీన్ ఫాతిమ, రాఘవ లైఫ్ సైన్సెస్ ప్రతినిధులు రామ్మోహన్‌రెడ్డి, విజయకుమార్‌శర్మ, ఉమాశంకర్, ప్రసన్నరావు, సాయికుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఠాణా ఏర్పాటయ్యేనా?

- సీఎం కేసీఆర్ ఆదేశించి ఏడాదిన్నర
- ఇప్పటికీ మంజూరుకు నోచుకోని స్టేషన్
- సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- ఉన్న సిబ్బంది చలానాల వసూళ్లకే పరిమితం
- జిల్లాకేంద్రంలో తీరని ట్రాఫిక్ కష్టాలు

> "జిల్లా కేంద్రంగా కామారెడ్డి పట్టణం విస్తరిస్తోంది. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయండి. అలాగే కామారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ స్థాయిని ఎస్‌హెచ్‌వో స్థాయికి పెంచండి" – 2021 జూన్ 20న కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీజీపీకి సీఎం కేసీఆర్ ఆదేశాలు..
>
> సీఎం కేసీఆర్ ఆదేశించి ఇరవై నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కామారెడ్డికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు కాలేదు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలూ తీరలేదు.

సాక్షి, కామారెడ్డి: రైల్వే సౌకర్యంతో పాటు జాతీయ రహదారి కూడా ఉండడంతో కామారెడ్డి పట్టణం నాలుగైదు దశాబ్దాలుగా వ్యాపార, వాణిజ్య రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. జిల్లా అయిన తర్వాత అభివృద్ధి జోరు మరింత పెరిగింది. దీంతో కామారెడ్డికి వచ్చిపోయే వారి సంఖ్య కూడా పెరగడంతో ట్రాఫిక్ కష్టాలూ ఎక్కువయ్యాయి. జనాభాకు అనుగుణంగా పోలీసు సిబ్బందిని పెంచకపోవడం, ట్రాఫిక్‌కు సంబంధించి పోలీసు స్టేషన్ ఏర్పాటు కాకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు.

భారీగా పెరిగిన రాకపోకలు...

కామారెడ్డి పట్టణం నాలుగైదు జిల్లాలకు కూడలిగా ఉంది. రైస్ ఇండస్ట్రీ, ఫార్మా బిజినెస్, వస్త్ర వ్యాపారం, బీడీ పరిశ్రమ.. ఇలా ఎన్నో వ్యాపారాలు ఇక్కడ జోరుగా సాగుతాయి. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణంలో ప్రధాన కూడళ్లైన నిజాంసాగర్ చౌరస్తా, గవర్నమెంట్ హాస్పిటల్, కొత్తబస్టాండ్, అశోక్‌నగర్ చౌరస్తా, ఇందిరాచౌక్, ధర్మశాల, రామారెడ్డి చౌరస్తాల వద్ద గతంలో స్థానిక పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉండేవారు. ఇప్పుడు నిజాంసాగర్ చౌరస్తాలోనే కనిపిస్తున్నారు. వారు కూడా తనిఖీలు, చలానాల వసూళ్లకే పరిమితమయ్యారు. చౌరస్తాలలో సిబ్బంది లేకపోవడంతో వాహనదారులు సిగ్నల్స్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. స్టేషన్‌రోడ్డు వైపు నుంచి అడ్లూర్‌రోడ్డు వైపు నుంచి వాహనాలు అటూ, ఇటూ తిరిగే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే స్టేషన్ ప్రధాన గేటు వద్ద నియంత్రణ లేక వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ధర్మశాల, రామారెడ్డి చౌరస్తాలలో ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం. వ్యాపారాలు ఎక్కువగా సాగే తిలక్‌రోడ్డు, సుభాష్‌రోడ్డు, గంజ్ రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లలో అయితే పరిస్థితి ఘోరంగా ఉంటుంది. అశోక్‌నగర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ రోడ్డులో కూడా అదే పరిస్థితి. రామారెడ్డి రోడ్డులోనూ ట్రాఫిక్ ఎక్కువగా పెరిగింది.



సుభాష్‌రోడ్‌లో ట్రాఫిక్ పరిస్థితి



సుభాష్‌రోడ్‌లో ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనాలు

ఠాణా ఏర్పాటైతే..

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటైతే ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు, పది మందికిపైగా కానిస్టేబుళ్లను కేటాయిస్తారు. ట్రాఫిక్ నియంత్రణకు కావాల్సిన పరికరాలు, సౌకర్యాలు సమకూరుతాయి. సీఎం ఆదేశించినా.. జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపినా.. ఇప్పటికీ ట్రాఫిక్ ఠాణా మంజూరు కాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలను పట్టణ పోలీసులే చూసుకోవాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యటనలకు తోడు నిత్యం జిల్లా కేంద్రంలో అనేక రకాల ఆందోళనలు కొనసాగుతాయి. పట్టణ పోలీసులు వాటికే సరిపోవడం లేదు. దీంతో ట్రాఫిక్ అంశం ఎవరికీ పట్టకుండాపోతోంది. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఠాణా ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు..

పట్టణాన్ని రెండుగా చీల్చే రైల్వే లైనుపై ఉన్న ఇరుకు వంతెనతోపాటు రైల్వే గేటు వద్ద వాహనదారులకు నరకం కనిపిస్తోంది. రైల్వే బ్రిడ్జి మీదుగా వేలాది వాహనాల రాకపోకలతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్రిడ్జి మీద లైటింగ్ వ్యవస్థ సరిగా లేదు. అశోక్‌నగర్‌లోని రైల్వే గేటు మీదుగా ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు ఈ గేటు మీదుగానే వెళ్తుంటారు. నిత్యం 50 కిపైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. రైలు రాకపోకల సందర్భంగా కనీసం పది నిమిషాలపాటు గేటు వేస్తున్నారు. దీంతో రైళ్లు వచ్చిపోయినపుడల్లా ట్రాఫిక్ భారీగా జామ్ అవుతోంది.

గోడ కూలి అన్నదమ్ముల మృతి

- పాత ఇంటికి మరమ్మతులు చేస్తుండగా దుర్ఘటన



లింగన్న (ఫైల్)



రాములు(ఫైల్)



అన్నదమ్ములు మృతి చెందిన ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు

మోర్తాడ్(బాల్కొండ): పాత ఇంటికి మరమ్మతులు చేస్తుండగా గోడకూలడంతో తాపీ పని చేస్తున్న అన్నదమ్ములు గోనుగొప్పుల లింగన్న(70), గోనుగొప్పుల రాములు (68) దుర్మరణం చెందారు. మోర్తాడ్‌లో మంగళవారం చోటు చేసుకున్న దుర్ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. లత అనే మహిళ ఇల్లు పాడుబడటంతో ఇంటిని మరమ్మతులు చేయించడానికి స్థానిక తాపీ పనివారికి పురమాయించింది. గోడకు నీరు పట్టి ఉండటం వల్ల మరమ్మతులు చేసే సమయంలో గోడపెళ్లలు లింగన్న, రాములుపై పడ్డాయి. వీటిలో కూరుకుపోయిన లింగన్న అక్కడికక్కడే మరణించాడు. రాములును ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఘటన స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు, మోర్తాడ్ ఎస్సై ముత్యంరాజు సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు అన్నదమ్ములు ఒకే ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎప్పుడూ అన్నదమ్ములు కలివిడిగా ఉండేవారని స్థానికులు తెలిపారు.

'మాతృభాషతోనే మనుగడ'

కామారెడ్డి అర్బన్: బతుకుదెరువు కోసం బహుభాషలు నేర్చుకున్నా మాతృభాషను మర్చిపోవద్దని, తల్లిభాషతోనే వికాసం, మనుగడ ముడిపడి ఉంటాయని కామారెడ్డి ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు తెలుగుశాఖ అధ్యక్షుడు శంకర్ మాట్లాడారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ నేపథ్యం, బంగ్లాదేశ్‌లో బెంగాలీ భాష కోసం విద్యార్థులు చేసిన ఉద్యమం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రామస్వామి, శ్రీవేణి, వినోద్‌కుమార్, శ్రీనివాస్‌రావు, కృష్ణమోహన్, శ్రీలత, ఆయేషా ఉజ్మా తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీకి చిక్కిన ధరణి ఆపరేటర్

- భూ రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం డిమాండ్
- రైతు ఫిర్యాదు మేరకు పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఆపరేటర్ స్వగ్రామం తాడ్వాయి మండలంలోని నందివాడలోనూ సోదాలు

కొడిపల్లి(నర్సాపూర్): పది గుంటల వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన కొడిపల్లి తహసీల్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకటరాజాగౌడ్, రమేశ్‌తో కలిసి మంగళవారం రాత్రి వివరాలు వెల్లడించారు. కొడిపల్లి మండలం తిమ్మాపూర్‌కు చెందిన రైతు నీరుడి పోచయ్య గ్రామానికి చెందిన పానుగంటి సత్తమ్మ నుంచి 20 గుంటల భూమి కొనుగోలుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. అందులోనుంచి 10 గుంటల భూమిని ఇతరులకు అమ్మాడు. మిగతా 10 గుంటల భూమి రిజిస్ట్రేషన్ కోసం గతనెల 25న తహసీల్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ వేణురెడ్డిని కలిశాడు. అతడు రూ.20 వేలు లంచం డిమాండ్ చేయడంతో అదే రోజు రైతు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. మంగళవారం రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్‌చేసుకొని, లంచం డబ్బు తెచ్చినట్లు చెప్పడంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేశాడు. లంచం డబ్బులు కొడిపల్లి మండలం లింగంపల్లితండాకు చెందిన కెతావత్ రాజుకు ఇవ్వాలని వేణురెడ్డి చెప్పడంతో తహసీల్ కార్యాలయం ఆవరణలో డబ్బులు ఇచ్చాడు. ఏసీబీ అధికారులు పట్టుకుని ధరణి ఆపరేటర్ వేణురెడ్డి, మధ్యవర్తి రాజుపై కేసునమోదు చేశారు. లంచం విషయమై తహసీల్ కార్యాలయంలో ఇంకా ఎవరి ప్రమేయం ఉందన్న విషయమై విచారణ చేస్తున్నారు.

నందివాడలో కలకలం!

తాడ్వాయి: ఏసీబీకి చిక్కిన కొడిపల్లి ధరణి ఆపరేటర్ వేణురెడ్డి స్వగ్రామం తాడ్వాయి మండలంలోని నందివాడ. మంగళవారం రాత్రి ఆయన స్వగ్రామంలోని ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగాయి. నందివాడలో ఏసీబీ అధికారులు సోదాలు జరపడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ఉన్నతి

- గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి
- సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్



గర్భిణులతో మాట్లాడుతున్న స్మితా సబర్వాల్, పక్కన శ్వేతా మహంతి, భారతి హోలికెరి, కలెక్టర్ పాటిల్

భిక్కనూరు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఉన్నతిని సాధిస్తుందని, తద్వారా రాష్ట్రం ఆరోగ్య తెలంగాణగా ఎదుగుతుందని సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉండడం ద్వారానే భావి పౌరులుగా ఎదుగుతారన్నారు. రేపటి తరం బాగుకోసం ప్రతి గర్భిణీ కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కిట్ వినియోగం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరగడంతో పాటు పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పాలల్లో కెసిన్ అనే ఎంజైమ్ ఉంటుందని, ఇది పుట్టే పిల్లలలో ఎముకల ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. గర్భిణులు తప్పనిసరిగా పాలు తాగాలన్నారు. తనకు 18 ఏళ్ల బాబు ఉన్నాడని, తాను కూడా గర్భిణీగా ఉన్నపుడు ఇలాంటి పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల ఎంతో మేలుపొందానని పేర్కొన్నారు.

కిట్ విషయంలో గొడవపడ్డాం...

గర్భిణుల కోసం తయారు చేసిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ బాక్సు కోసం తాను శ్వేతా మహంతితో గొడవపడ్డానని స్మితా సబర్వాల్ నవ్వుతూ చెప్పారు. కాన్పు తర్వాత కూడా బాలింతలు ఎక్కడికి వెళ్లినా పిల్లలకు సంబంధించిన వస్తువులు ఈ బాక్సుల్లో పెట్టుకుంటారని శ్వేతా మహంతి తనను ఒప్పించిందని పేర్కొన్నారు.

ముర్రుపాలను తాగిస్తే..

ప్రసూతి అయిన మొదటి గంటలోపు ముర్రిపాలను తాగిస్తే ఆ బిడ్డ ఆరోగ్యకరంగా ఉండడానికి ఉపయోగపడుతుందని మహిళాశిశు సంక్షేమ అదనపు కమిషనర్ భారతీ హోలీకెరి పేర్కొన్నారు. ముహూర్తాలు చూసి ప్రసవాలు చేయించుకోవద్దన్నారు. ప్రతి గర్భిణీ హిమోగ్లోబిన్ 14 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, మాంసకృత్తులు ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి సూచించారు.

డ్రైఫ్రూట్స్ ఇవ్వండి..

కేసీఆర్ కిట్స్‌లో డ్రైఫ్రూట్స్ కూడా ఇవ్వాలని పలువురు బాలింతలు, గర్భిణులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా స్మితా సబర్వాల్ మాట్లాడుతూ పరిశోధనలు నిర్వహించి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్‌ను రూపొందించామన్నారు. డ్రైఫ్రూట్స్ వల్ల కొందరికి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని, అలాగే వాటిని ఫ్రిడ్జ్‌లో పెట్టకుంటే చెడిపోతాయని, అందుకే కిట్స్‌లో వాటిని చేర్చలేదని పేర్కొన్నారు. త్వరలో మరిన్ని పదార్థాలను చేర్చేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

కంటి వెలుగు పరిశీలన..

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అద్దాలు ఏమేరకు అందుబాటులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.

ఆశావర్కర్లకు ఇన్సెంటివ్ అందిస్తాం

పనికి తగ్గ వేతనం అందించేందుకు ఆశావర్కర్లకు ఇన్సెంటివ్‌ను అందజేస్తామని స్మితా సబర్వాల్ హామీ ఇచ్చారు. తమకు సరైన వేతనం అందడం లేదని ఆశావర్కర్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆశావర్కర్ల పరిధిలో ఉన్న గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డలను ప్రసవించినపుడు వారికి పనికి ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌ను అందజేస్తామని స్మితా సబర్వాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, సర్పంచ్ తునికి వేణు, ఎంపీపీ గాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మ, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు శోభారాణి, చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ రమ్య, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో అనంతరావ్, ఎంపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ గర్భిణులు, బాలింతలతో మాట్లాడి, అభిప్రాయాలు తెలుసుకున్నారు.

స్మితాసబర్వాల్ : హిమోగ్లోబిన్ ఎంత ఉండాలో తెలుసా ?

లావణ్య(గర్భిణి) : 13 నుంచి 14 ఉండాలి.

స్మితా సబర్వాల్ : మీకు ఎంత ఉంది? న్యూట్రిషన్ కిట్స్ వాడకముందు ఎంత ఉంది?

లావణ్య : ఇప్పుడు 13 ఉంది. న్యూట్రిషన్ కిట్ వాడకముందు 11 ఉండె మేడం.

స్మితా సబర్వాల్ : ఏవిధంగా వాడుతున్నారు?

లావణ్య : వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పిన ప్రకారం తీసుకుంటున్నాం.

స్మితా సబర్వాల్ : ఏది రుచిగా ఉంది? ఏది రుచిగా లేదు?

మంజుల (గర్భిణి) : కర్జూరం, మదర్ హార్లిక్స్ రుచిగా ఉన్నాయి మేడం. ఐరన్ సిరప్ కొద్దిగా చేదుగా ఉంది.

స్మితా సబర్వాల్ : కర్జూరం తప్పనిసరిగా తీసుకోవాలి. న్యూట్రిషన్ ఫుడ్ గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎవరికీ ఇవ్వొద్దు.

'శ్వేత' దరహాసం!

భిక్కనూరులో పర్యటించిన రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి చిరునవ్వుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె సుమారు రెండు గంటలపాటు భిక్కనూరులో ఉన్నారు. పర్యటన ఆద్యంతం చిరునవ్వుతోనే కనిపించారు. అందరినీ నవ్వుతూ పలకరించారు. ఆమె దరహాసం చూసి మహిళలు అచ్చెరువొందారు.



బాలుడిని పలకరిస్తున్న శ్వేతా మహంతి

'ఎరువుల కొరత తీరుస్తాం'



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార గంగారెడ్డి

సదాశివనగర్/రాజంపేట: యూరియా కొరతను రెండు రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సదాశివనగర్‌లో, రాజంపేట మండలం కొండాపూర్‌లో శనగ కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా పరిధిలో రైతులు సుమారు 89 వేల ఎకరాలలో శనగ పంట సాగు చేశారన్నారు. పంట కొనుగోలు కోసం జిల్లాలో 14 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్వింటాలుకు రూ. 5,335 ధర చెల్లిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలను 90 రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సదాశివనగర్, రాజంపేట ఎంపీపీలు అనసూయ, లింగాల స్వరూప, జెడ్పీటీసీలు నర్సింలు, కొండ హన్మండ్లు, సదాశివనగర్, కొండాపూర్ సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, స్వాతి, సొసైటీల చైర్మన్లు కమలాకర్‌రావు, కంది శివరాములు, కపిల్‌రెడ్డి, ఏడీఏ అపర్ణ, ఏవో జ్యోత్స్న, ఏఈవో మౌనిక, సీఈవోలు విఘ్నేశ్‌గౌడ్, సాయిలు, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు బీరయ్య, రాంచందర్‌రావు, భైరవరెడ్డి, నాయకులు భూంరెడ్డి, సదాశివరెడ్డి, సంగవ్వ, వంకాయల రవి, బాబయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్న జీపీలపై భారం..

- వాణిజ్య విభాగం పరిధిలోకి ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు
- ప్రతి మూడు నెలలకు రూ.1500 పన్ను
- తడిసి మోపెడవుతున్న నిర్వహణ ఖర్చులు

జక్రాన్‌పల్లి: గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేసింది. వీటితో చెత్త సేకరణతో పాటు, హరిత హారం మొక్కలకు నీరు పట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా ట్రాక్టర్ల నిర్వహణలో అసలు పంచాయితీ ఏర్పడింది. కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు వాణిజ్య విభాగం కింద రిజిస్ట్రేషన్ చేయించడంతో పంచాయతీలకు పెనుభారంగా మారింది. వీటిని వాణిజ్య విభాగంలోకి చేర్చడంతో ప్రతి మూడు నెలలకు రూ.1500 చొప్పున పన్ను కట్టాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో 1056 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1051 జీపీలకు ట్రాక్టర్లు ఉన్నాయి. మొత్తం ఏడాదికి రూ.63.04 లక్షలు ఉమ్మడి జిల్లాలోని జీపీలు పన్ను కట్టాల్సి వస్తోంది. దీనికి తోడు ఏటా రోడ్ ట్యాక్స్ రూ.ఆరు వేలు చెల్లించాలి. అలాగే ఇద్దరు మల్టిపర్పస్ వర్కర్లకు జీతాలు, అదనపు ఖర్చులు అవుతున్నాయి. ప్రతి మైనర్ పంచాయతీకి ఏడాదికి రూ.మూడు లక్షల నుంచి రూ. నాలుగు లక్షల వరకు భారం పడుతోంది. మేజర్ పంచాయతీలకు రూ.ఐదు లక్షల వరకు నిర్వహణ వ్యయం అవుతోంది.

గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. పంచాయతీలకు కేంద్ర రాష్ట్ర నిధులతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇంటి పన్ను, నీటి పన్ను ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఈ ఏడాది 14వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు వచ్చాయి. చిన్న గ్రామ పంచాయతీలకు రూ.20 నుంచి రూ.22లక్షలు, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ.40లక్షల నుంచి రూ.55 లక్షల వరకు వచ్చాయి. ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్ల నిర్వహణకు ఏడాదికి రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతోంది. దీంతో చిన్న పంచాయతీలకు ఇబ్బంది అవుతోంది. దీనికి తోడు వీధిదీపాలు, తాగునీటి సరఫరా, విద్యుత్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ, పల్లె ప్రగతి కార్యక్రమాలకు ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. అలాగే హరితహారం నిర్వహణ, ట్రీగార్డుల కొనుగోలు, మొక్కల సంరక్షణ ఆర్థికభారంగా మారుతోంది.



చాంద్‌మియాబాగ్ తండా జీపీ కార్యాలయం

అభివృద్ధి చేయలేకపోతున్నాం



తండాలు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పడితే ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆశించాం. కానీ మైనర్ గ్రామ పంచాయతీ కావడంతో ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు కావడం లేదు. వచ్చిన నిధులు గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు, హరిత హారం నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలకే సరిపోతున్నాయి. చిన్న జీపీలు ఏర్పడిన నిధులు లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు.

– కిషన్‌నాయక్, సర్పంచ్, చాంద్‌మియాబాగ్ తండా

నిధులు సరిపోవడం లేదు..



నిధుల లేమి కారణంగా చిన్న గ్రామ పంచాయతీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. వచ్చిన నిధులతో కరెంట్ బిల్లు, ట్రాక్టర్ల ఈఎంఐలు కట్టడానికే సరిపోతుంది. మూడు నెలలుగా సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదు. గ్రామంలో నిర్మించిన భవన నిర్మాణాల అనుమతి డబ్బులను సైతం ప్రభుత్వం వాడుకుంటోంది. ఈ డబ్బులు జీపీ ఖాతాలో జమా చేయాల్సి ఉండగా పంచాయతీరాజ్ శాఖకే వెళ్లిపోతున్నాయి.

– సాయరెడ్డి, సర్పంచ్, మునిపల్లి

అచ్చం ఒకేలా..

ఎల్లారెడ్డి రూరల్: ఒకే పోలిక.. అచ్చం ఒకరిని చూస్తే మరొకరిని చూసినట్లే.. జిరాక్స్ టూ జిరాక్స్, ఒకే డ్రెస్.. ఇట్లా చెప్పుకుంటూ పోతే కవలల గురించి ఎన్నో అంశాల్ని పోల్చి చెప్పవచ్చు. తల్లిగర్భంలో ఒకే సారి, ఒకే రూపంతో మొదలై.. క్షణాల వ్యవధిలోనే బయటి ప్రపంచానికి పరిచయమై ఒకే ముఖకవలికలతో అందరినీ అమితంగా ఆకట్టుకుంటారు. అంతెందుకు పేర్లు కూడా ఒకేలా పెట్టుకొని తికమక చేస్తుంటారు. నేడు ప్రపంచ కవలల దినోత్సవం సందర్భంగా కథనం..



- ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన తాటిచెట్టి రజిత, శ్రీనివాస్ దంపతుల సంతానమైన గిరిధర్, గీతిక 2014 జూలై 14న జన్మించారు.



- ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన అన్నపూర్ణ- శ్రీ నివాస్‌గౌడ్ దంపతుల సంతానమైన సుక్కృతి, సంహిత 12 మే 2004న జన్మించారు.



- ఎల్లారెడ్డికి చెందిన పట్టెం ప్రసాద్, ప్రేమలతలకు హర్ష-హర్షిత్ 10 మే 2018న జన్మించారు.



- ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వారాల వేణు వీణ దంపతుల కుమార్తెలు చైత్రిక, స్మితికలు 16 అక్టోబర్ 2008వ సంవత్సరంలో జన్మించారు.



- మండలంలోని సోమార్‌పేట గ్రామానికి చెందిన జంబిగ మౌనిక జీవన్ దంపతుల సంతానమైన సాహస్, సాహస్ర 19 జూలై 2014లో పుట్టారు.



- ఎల్లారెడ్డి మండల ఆజామాబాద్ గ్రామానికి చెందిన పట్లోళ్ల ఉమాదేవి-శ్రీనివాస్ దంపతుల సంతానమైన గణాదిత్య, విక్రమాదిత్య 2010 జనవరి 27న జన్మించారు.



- ఎల్లారెడ్డికి చెందిన జ్యోతి- కీర్తిరాజ్ దంపతులకు అనన్య, అనిష్ 1 అక్టోబర్ 2018న పుట్టారు.



కార్తీక్, కరుణ



శ్రీనాథ్, హరినాథ్

త్వరలో అర్హులకు పోడు పట్టాలు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్(మోస్రా): పోడు భూములకు సంబంధించిన సర్వేలు పూర్తయ్యాయని, అర్హులకు త్వరలోనే పట్టాలు పంపిణీ చేస్తారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మోస్రా మండల కేంద్రంలో మంగళవారం మోస్రా, చందూర్ మండలాల అభివృద్ధిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన మోస్రా, చందూర్ మండలాలకు కేటాయించిన నిధుల వివరాలు వెల్లడించారు. కాంప్లెక్స్ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, కుల సంఘాలు, గ్రామ పంచాయతీ భవనాలకు నిధులు ఇచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఎవరైనా అనవసర విమర్శలు చేస్తే తిప్పి కొట్టాలన్నారు. మోస్రా, చందూర్ లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్ అందజేశారు. ఈ సమావేశంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, జెడ్పీటీసీ గుత్ప విజయ భాస్కర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు పిట్ల శ్రీరాములు, తహసీల్దార్ సాయిలు, పోచారం సురేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మోస్రాలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

ఇంటర్ ప్రాక్టికల్స్



నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ రెండో స్పెల్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన పరీక్షల్లో 44మంది జనరల్ విద్యార్థులు, ఒకేషనల్‌లో 55 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. మధ్యాహ్నం జనరల్ 894మంది విద్యార్థులకు 863మంది, ఒకేషనల్ 304మంది విద్యార్థులకు 245 మంది హాజరయ్యారు. డీఐఈవో రఘురాజ్ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి



సదాశివనగర్: పద్మశాలి కులస్తులు ఐక్యంగా ఉండాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీగాథ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పద్మశాలి సంఘ భవనంలో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా రాణించాలన్నారు. బొమ్మెర రాజయ్య, సబ్బని ధర్మపురి, భూమేశ్, ఇంజమూరి శ్రీనివాస్, దేవసాని పోశెట్టి, బిట్ల శంకర్, సత్యం, చౌకి నాగరాజు, గణేశ్, కావేరి నారాయణ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. పరీక్షకు జిల్లాకు చెందిన పలు మండలాలకు చెందిన 46 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్మూర్ మోడల్ స్కూల్ విద్యార్థి సయ్యద్ అహ్మద్ ప్రథమ స్థానంలో, ఎస్సారెస్పీ గురుకుల పాఠశాలకు చెందిన ఎండీ సఫియాన్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. డీఎస్‌వో గంగకిషన్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, ఎంఈవో రాజ గంగారం ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన వంశి, రుషిక, నిషాంతకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్, రఘునాథ్, శ్రీనివాస్‌గౌడ్, మగ్గిడి గంగాధర్, లక్ష్మణ్, హెచ్‌ఎంలు గంగారం, అనసూయ పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఎంఈవో

నాణ్యమైన వైద్య సేవలందించాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో వర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి అన్నారు. మంగళవారం తెయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. హెల్త్ సెంటర్‌లోని గదులను సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడి వైద్య సేవలు, మందులు, వసతి సౌకర్యాల వివరాలు తెలుసుకున్నారు. వైద్యురాలు అనూషతో మాట్లాడారు. సెంటర్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, పీఆర్‌వో జమీల్, అధ్యాపకులు ఉన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లింబాద్రి

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న అప్పాల ప్రసాద్

- సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్

కామారెడ్డి టౌన్: అన్ని కులాల్లో మహనీయులు జన్మించారని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. కులం కన్న గుణం మిన్న అని చాటిచెప్పిన మన పూర్వీకుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి కళాభారతి ఆడిటోరియంలో సంత్ రవిదాస్, సంత్ సేవాలాల్, సంత్ గాడ్గే బాబా, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతి, ఛత్రపతి శివాజీ మొదలైన సమతా మూర్తుల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 300 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని కులాల వారు సోదరభావంతో మెలగాలన్నారు. సమాజంలో ఉన్న అంటరానితనం, కుల వివక్ష మొదలైన దురాచారాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక జిల్లా అధ్యక్షుడు అమృత రాజేందర్, జిల్లా సంయోజక్ బాల్‌రాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మన్నె కృష్ణ, ప్రతినిధులు బొడ్డు శంకర్, గోవర్ధన్, బాస రఘుకుమార్, తుమ్మ రాంచంద్రం, సూర్య ప్రకాష్, ఏముల వెంకటేశ్వర్లు, దత్తురావు, శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో గ్రామంలో ఒకే రోజు ఐదుగురి మృతి

- అంత్యక్రియలకు ఇబ్బందులు

మాచారెడ్డి : మండలంలోని పాల్వంచ గ్రామంలో వివిధ కారణాలతో ఒకే రోజు ఐదుగురు మృతిచెందిన ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వేర్వేరు కారణాలతో ఐదుగురు మృతిచెందడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా భూమేశ్ (43) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందగా, మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. భూమేశ్ అంత్యక్రియలు ముగిసేలోగా గ్రామానికి చెందిన మస్కట్ నర్సయ్య (70), మంద నర్సయ్య (65), కుంచం రాజయ్య (75), బండ రామాగౌడ్ (75) లు ఒకరితరువాత ఒకరు మృతి చెందడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఐదుగురి అంత్యక్రియలు ఒకేరోజు జరపాల్సిన పరిస్థితుల్లో పనివారు ఇబ్బందిపడ్డారు. ఒకరి తరువాత ఒకరి అంత్యక్రియలు రాత్రి వరకు కొనసాగాయి.

ఠాణాలో యువకుడి వీరంగం

రామారెడ్డి: రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. గ్రామానికి చెందిన బీట్ల రవి సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఠాణాకు వెళ్లి హంగామా చేశాడు. పోలీసులు దుషించి, గొడవ చేశాడు. దీంతో రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

నెమలిని కాపాడిన రైతు



సిరికొండ : బావిలో పడిన జాతీయ పక్షి నెమలిని ఓ యువ రైతు కాపాడాడు. మండలంలోని కొండూర్ గ్రామంలో పొలాల్లో నీళ్లు ఎండిపోయిన బావిలో నెమలి పడింది. పొలం వద్దకు వెళ్లిన యువ రైతు లింబారెడ్డికి బావిలో నుండి నెమలి అరుపులు వినిపించాయి. బావి వద్దకు వెళ్లి చూడగా నెమలి బావిలో ఉంది. తాడు సాయంతో బావిలోకి దిగి నెమలిని కాపాడి పైకి తీసుకొచ్చారు. అలసిపోయిన నెమలికి లింబారెడ్డి నీళ్లు తాగించి అడవిలో వదిలిపెట్టాడు.

‘మాతృభాషను కాపాడుకోవాలి’

కామారెడ్డి టౌన్: సమాజంలో నైతిక విలువలు పెంపొందడానికి మాతృభాషలు తోడ్పడతాయని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణ భాషలతోనే సాధ్యమన్నారు. మాతృభాషను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆంగ్ల భాష మోజులో పూర్తిగా పడిపోకుండా మాతృ భాషను పరిరక్షించుకొవాలన్నారు. కవి సమ్మేళనంలో కవులు గంగాప్రసాద్, నాగభూషణం, అల్లి మోహన్ రాజ్, కాసర్ల రాంచంద్రం, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గఫూర్ శిక్షక్

పాఠశాలలను తనిఖీ చేసిన రాష్ట్ర బృందం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, హాసాకొత్తూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) సభ్యులు మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్ర మానిటరింగ్ అధికారి శ్రీనాథ్ నేతృత్వంలో సబ్జెక్ట్ నిపుణులు సంజీవ్, రామకృష్ణ, చక్రధర్, ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర అధికారి కిషన్ విద్యార్థులకు అందిస్తున్న బోధన విధానాలు, సౌకర్యాలను తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహణ, స్నాక్స్ ఇస్తున్నారా, ఉదయం వేకప్ కాల్ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పదో తరగతికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ ఆంధ్రయ్య ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర అధికారులు

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

భిక్కనూరు: భిక్కనూరు పరిధిలోని ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన సూరజ్‌కుమార్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్యాక్టరీ ఆవరణలో మంగళవారం రాత్రి ఉరి వేసుకున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. ప్రేమ వ్యవహారంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి కార్మికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సాఫ్ట్‌బాల్ శిక్షణ ప్రారంభం

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల ప్రాబబుల్స్ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ క్రీడాకారిణులను పరిచయం చేసుకుని శిక్షణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారని తెలిపారు. నరేష్‌చంద్ర, ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ప్రభాకర్‌రెడ్డి, గంగమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, సురేష్, కోచ్ వేములమౌనిక పాల్గొన్నారు.



క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నిజాంసాగర్: నేరాల నియంత్రణకు ఊరూరా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులపై దురుసుగా ప్రవర్తించకుండా ఫిర్యాదులను తీసుకోవాలన్నారు. మంగళవారం సాయంత్రం జుక్కల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రిజిస్టర్లు, రికార్డులను ఆయన పరిశీలించి ఎస్సై పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బిచ్కుంద సీఐ కృష్ణ, ఎస్సై మురళి ఉన్నారు.

యథావిధిగా పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థుల అభ్యర్థన మేరకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ సెమిస్టర్ పరీక్షలను యథావిధిగా నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ మొదటి, మూడో సెమిస్టర్స్ (ఎంసీఏ, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ), 5వ 7వ, 9వ సెమిస్టర్స్ (ఎల్ఎల్‌బీ, ఐఎంబీఏ) పరీక్షలు ఈ నెల 24 నుంచి పాత షెడ్యూల్ ప్రకారమే ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రీసెర్చ్ మెథడాలజీపై వర్క్‌షాప్



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో‘రీసెర్చ్ మెథడాలజీ’పై వర్క్‌షాప్ జరిగింది. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర జ్యోతి వెలిగించి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపల్ ఇందిరా, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వైద్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ప్రారంభమైన టీఎన్జీవోస్ క్రీడలు




నిజామాబాద్ నాగారం: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రీడలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాలిటెక్నిక్ మైదానంలో వేముల సురేందర్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈనెల 25 వరకు పోటీలు జరుగనున్నాయి. జిల్లా కార్యదర్శి అమృత్‌కుమార్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, సుమన్, జాఫర్, జాకీర్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు

మొదటి మ్యాచ్ జిల్లా పరిషత్ వర్సెస్ డ్వామా మధ్య జరిగింది. ఇందులో డ్వామా జట్టు గెలిచింది. మరో మ్యాచ్‌లో వెల్ఫేర్ శాఖ, సీటీవో శాఖ తలపడ్డాయి. వెల్ఫేర్ శాఖ గెలిచింది. వ్యవసాయ వర్సెస్ పోలీస్‌శాఖ మధ్య పోటీ జరగ్గా వ్యవసాయ శాఖ గెలిచింది. ఆర్అండ్‌బీ, రిజిస్ట్రేషన్ శాఖ జట్టు మధ్య జరిగిన పోటీలో ఆర్అండ్‌బీ జట్టు గెలిచింది. డీపీవో, డీటీవో మధ్య పోటీలో డీపీవో విజయం సాధించింది. ఇరిగేషన్, మెడికల్ శాఖ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరిగేషన్ జట్టు గెలుపొందింది. సర్వేశాఖ వర్సెస్ పశుసంవర్ధక శాఖ మ్యాచ్‌లో పశుసంవర్ధక శాఖ గెలిచింది.

ఒకరి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన బుద్ధం ప్రవీణ్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ప్రవీణ్ అర్సపల్లి సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తాడు. సోమవారం సాయంత్రం ఆఫీసుకు వెళ్లివస్తానని చెప్పి ఇంటికి రాలేదని భార్య శీతల్ మంగళవారం మూడో టౌన్ ఠాణాలో ఫిర్యాదు చేసింది.

కరెంట్ బిల్ పేరిట రూ.49 వేలు టోకరా

- వెంటనే ఫిర్యాదు చేయడంతో డబ్బు ఫ్రీజ్



కామారెడ్డి క్రైం: సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఓ వ్యక్తికి చెందిన రూ.49 వేల నగదు నేరస్తుల ఖాతాలోకి వెళ్లకుండా సైబర్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఈ ఘటన మంగళవారం దేవునిపల్లిలో పరిధిలో వెలుగు చూసింది. వివరాలు.. దేవునిపల్లిలో నివాసం ఉండే రాజేశ్వర్‌రావుకు ఈనెల 20న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ ఇంటి కరెంట్ బిల్లు రెండు నెలలుగా కట్టలేదని, ఇప్పుడు చెల్లించకపోతే సరఫరా నిలిపి వేస్తామని హెచ్చరించారు. తాను పంపిన లింక్ క్లిక్ చేసి బిల్లు కట్టాలని సూచించాడు. దీంతో రాజేశ్వర్‌రావు అలాగే చేయడంతో సదరు వ్యక్తి అకౌంట్లో నుంచి రూ.49 వేలు కట్ అయ్యాయి. వెంటనే బాధితుడు బ్యాంక్ అధికారులను సంప్రదించగా సైబర్ మోసం జరిగిందని బ్యాంకర్లు చెప్పారు. దీంతో ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ పోలీసులు సదరు అకౌంట్లో నుంచి సైబర్ నేరస్తుల అకౌంట్‌కు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

క్రైం కార్నర్

ఎంత పెద్ద పామో!



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో మంగళవారం పొడవైన నాగుపాము ప్రత్యక్షమయింది. కాలనీలో పిల్లలు ఆడుకుంటున్న ప్రాంతంలోకి పాము రావడంతో అక్కడే ఉన్న మహిళలు గుర్తించి స్థానిక యువకులకు సమాచారం ఇచ్చారు. దీంతో యువకులు అక్కడికి చేరుకొని దానిని చంపారు. ఆ పాము సుమారు ఆరు ఫీట్లకు పైగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మహేందర్(ఫైల్)

నవీపేట: మెదక్ జిల్లా రామాయంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేటకు చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముత్యాల మహేందర్(29) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. వారం క్రితం ఆయన హైదరాబాద్ నుంచి నవీపేటకు వచ్చాడు. సోమవారం సాయంత్రం స్కూటీపై హైదరాబాద్ వెళ్తుండగా రామాయంపేట శివారులో నర్సింగి వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాల పాలైన ఆయనను అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి తల్లి శాంతాబాయి, భార్య సంధ్య ఉన్నారు. ప్రస్తుతం సంధ్య గర్భిణి అని గ్రామస్తులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు..



లింబాద్రి (ఫైల్)

ధర్పల్లి: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన ధర్పల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీకృష్ణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తోట లింబాద్రి (48) సోమవారం రాత్రి తన పంట పొలానికి నీరు పెట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మంగళవారం ఉదయం వరకు తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు నరేష్ పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. బోరు మోటార్ వైర్లు తగిలి షాక్ కొట్టి చనిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా లింబాద్రి ధర్పల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతిపై జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నాయకులు సంతాపం తెలిపారు.